



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న పవన్‌కల్యాణ్

అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని సోమవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయన నేరుగా ఆలయానికి వచ్చారు. ఆలయంలో పవన్ కల్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరారు. - వివరాలు మెయిన్‌లో

## జడ్పీ అధికారుల అత్యుత్సాహం?

- గ్రామీణ నీటి సరఫరా విభాగంలో రూ.36 కోట్ల బిల్లులు క్లియర్ చేసేందుకు యత్నం
- వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగింత
- ఇప్పుడు వారికి చెల్లింపుల కోసం హడావిడి

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం పరిధిలో గల పథకాల నిర్వహణ, మరమ్మతుల పేరిట సుమారు రూ.36 కోట్లకు సంబంధించిన బిల్లులు మంజూరుకు జిల్లా పరిషత్ అధికారులు హడావిడి పడుతున్నట్టు తెలిసింది. రెండు, మూడు రోజులుగా జడ్పీ అకౌంట్స్ విభాగం సిబ్బందితో బిల్లులు తయారుచేయించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌కు యత్నిస్తున్నట్టు జోరుగా ప్రచారం సాగుతుంది. ఏటా గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పథకాల నిర్వహణ, మరమ్మతులు, ఇతరత్రా అవసరాలకు నిధులు కేటాయిస్తుంటారు. అయితే ఇందుకోసం గ్రామీణ నీటి సరఫరాలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద పనులకు టెండర్లు పిలుస్తారు. కానీ, గత వైసీపీ ప్రభుత్వం నామి నేషన్ విధానంలో కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమి పాలై, కూటమి విజయం సాధించింది. బుధవారం కొత్త ప్రభుత్వం కొలు వుదీరనున్నది. ఇటువంటి తరుణంలో జడ్పీ అధికారులు మూడు రోజుల నుంచి రాత్రింబవళ్లు గ్రామీణ నీటి సరఫరా పథకాల నిర్వహణ, మరమ్మతులకు సంబంధించిన బిల్లులు తయారుచేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు తొందరపడుతుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



# ఇసుక డిపోలు మూత

## కొత్త పాలసీ తేనున్న కూటమి ప్రభుత్వం

- జిల్లాలో ఇసుక లభ్యత వివరాలను సేకరిస్తున్న గనుల శాఖ
- వైసీపీ ప్రభుత్వంలో విపరీతంగా పెరిగిపోయిన ఇసుక ధర
- దాంతోపాటు కొరత
- పనులు లేక ఇబ్బందిపడిన భవన నిర్మాణ కార్మికులు



నర్సీపట్నం మండలం గబ్బాడలో ఖాళీగా ఉన్న ఇసుక డిపో

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

**జిల్లాలో ఇసుక డిపోలు మూతపడ్డాయి. ఉచిత ఇసుక పాలసీని అమలు చేసే క్రమంలో ప్రస్తుతం ఉన్న డిపోలను తాత్కాలికంగా మూసేయాలని గనుల శాఖకు మౌఖిక ఆదేశాలు అందాయి. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కొత్త ఇసుక పాలసీని తెచ్చింది. దీంతో ఇసుక ధర అమాంతంగా పెరిగిపోయింది. అదేవిధంగా సామాన్య, మధ్యతరగతికి ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది. నిర్మాణ రంగం పడకేయడంతో భవన నిర్మాణ కూలీలు, అనుబంధ రంగాల్లో ఉన్నవారు పనులు దొరక్క విలవిల్లాడారు. మరోవైపు అక్రమ తవ్వకాలు, రవాణా ఆగలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇసుకను వైసీపీ నాయకులు ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు.**

### గనుల శాఖ వివరాల సేకరణ

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఉండగా పేదలకు ఉచితంగా ఇసుక సరఫరా చేసింది. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇసుక పాలసీ మారనుందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన డిపోలను మూసేయాలని గనుల శాఖ నిర్ణయించింది. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, నక్కపల్లి, అచ్యుతాపురం మండలాల్లో డిపోలు మూత పడ్డాయి. డిపోలకు ఇసుక రవాణా చేసే అగనంపూడిలోని బఫర్ డిపోలో కూడా లావాదేవీలను నిలిపివేశారు.

నిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే వివిధ వర్గాలకు ఉపాధి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. 2014లో టీడీపీ ప్రభుత్వంలో ఉన్న ఉచిత ఇసుక పాలసీని కొద్దిపాటి మార్పులు చేసి మళ్లీ అమలు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా జిల్లా గనుల శాఖాధికారులు ఇప్పటికే ఇసుక తవ్వకాలకు ఎక్కడెక్కడ అవకాశాలు ఉన్నాయో వివరాలు సేకరిస్తున్నారు. సమగ్ర నివేదిక రూపొందించి కొత్త ప్రభుత్వం ముందు ఉంచనుందని సమాచారం.

టీడీపీ హయాంలో లోడింగ్, రవాణా ఖర్చులతో



అనకాపల్లి మండలం తగరంపూడిలో ఇసుక సేకరణ

కలిపి ట్రాక్టర్ ఇసుక రూ.2 వేలకు లభించేది. ఇరవై టన్నుల ఇసుక లారీ రూ.10 వేలు లేదా రూ.12 వేలకు లభించేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితులు మారిపోవడమే కాకుండా ఇసుక ధరలు పెరిగిపోయాయి. అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాడుగుల పరిసరాల్లో ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.5 వేల నుంచి రూ.6 వేలు పలుకుతోంది.

### అంతా అస్తవ్యస్తం

గత వైసీపీ ప్రభుత్వం జిల్లాలో ఐదుచోట్ల ఇసుక డిపోలను ఏర్పాటుచేసింది. ఇటు తూర్పుగోదావరి (గోదావరి నది), అటు శ్రీకాకుళం (వంశధార) జిల్లాల నుంచి ఇసుక రప్పించి ఆయా డిపోల్లో నిల్వ చేసి ప్రభుత్వ రంగసంస్థ అయిన ఏపీఎండీసీ ఆధ్వర్యంలో విక్రయాలు చేపట్టింది. 2021లో గనుల శాఖను తప్పించి జేపీ వెంచర్స్ అనే ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టు అప్పగించింది. కొన్నాళ్లు జేపీ వెంచర్స్ ఇసుక అమ్మకాలు, డిపోల నిర్వహణ బాధ్యతలు చూసింది. 2023లో టర్న్‌కీ అనే సంస్థతో పాటు మరో సంస్థకు సబ్ కాంట్రాక్టుకు అప్పగించి చేతులు దులుపుకుంది. అయితే టర్న్‌కీ చూసినా ప్రభుత్వ రికార్డుల్లో మాత్రం జేపీ వెంచర్స్ పేరు నమోదై ఉంది. 2023 మే 31వ తేదీతో జేపీ వెంచర్స్ సంస్థ కాంట్రాక్టు గడువు ముగిసింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ 2024 జనవరిలో ఇసుక సరఫరా సంస్థలకు మరోసారి గడువు పెంచింది. ప్రస్తుతం ఆయా డిపోలు మూతపడ్డాయి.

### నదుల్లో అక్రమ తవ్వకాలు

గడచిన రెండు వారాలుగా... మిగతా 6వ పేజీలో

## ఉక్కు కష్టాలు తీరేనా?



రామ్మోహన్‌నాయుడు



శ్రీనివాసవర్మ

- కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయమంత్రిగా నరసాపురం ఎంపీ శ్రీనివాసవర్మ
- రాష్ట్రానికి ఈ శాఖ కేటాయించడం ఇదే తొలిసారి
- కర్మాగారానికి మంచి రోజులు వస్తాయని అధికార, కార్మిక వర్గాల ఆశాభావం
- కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు పౌర విమానయాన శాఖ
- విశాఖ నుంచి ప్రత్యేక కార్గో సర్వీస్‌లకు అవకాశం
- మరింత వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి చెందిన ఎంపీలకు కీలక మంత్రి పదవులు దక్కడంతో ఇప్పటివరకూ ఉన్న సమస్యలు తొలగిపోనున్నాయి. శ్రీకాకుళం ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడుకు కేంద్రం పౌర విమానయాన శాఖ, అదేవిధంగా నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మకు భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ (సహాయ మంత్రి)లు కేటాయించారు. ఈ రెండింటి వల్ల విశాఖపట్నానికి మేలు జరగనుంది.

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదు. అందుకు ... మిగతా 6వ పేజీలో

# పెద్దేరుపై చిన్నచూపు

## పుష్కర కాలంగా ఆయకట్టుకు అందని సాగునీరు

- ప్రకటనలకే పరిమితమైన నిధుల మంజూరు
- ఏడాది క్రితం హడావుడి చేసిన బూడి, కరణం ధర్మశ్రీ
- రూపాయి విదల్చని వైసీపీ సర్కారు



బోసిపోయిన పెద్దేరు రిజర్వాయర్ కాలువ

బుచ్చెయ్యపేట, జూన్ 10:

**పెద్దేరు రిజర్వాయర్ పరిధిలో పూర్తి ఆయకట్టుకు సాగునీరందించాలనే లక్ష్యం నెరవేరడం లేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు పెద్దేరు రిజర్వాయర్ గతి మారుస్తామని ప్రకటనలు గుప్పించడం మినహా ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఈ క్రమంలో గత 13 సంవత్సరాలుగా బుచ్చెయ్యపేట మండలంలోని రైతాంగానికి పెద్దేరు రిజర్వాయర్ నీరు కలగానే మిగిలిపోయింది.**



అలంకారప్రాయంగా మిగిలిన అమ్మచెరువు లాక్

పెద్దేరు రిజర్వాయర్‌ను 2008లో ప్రారంభించడంతో జిల్లాలో ఎర్రవాయి ప్రాంతంగా పేరొందిన బుచ్చెయ్యపేట మండల రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సాగు కష్టాలకు తెరపడినట్టేనని సంబరపడిపోయారు. పెద్దేరు రిజర్వాయర్ నీటిని మండలంలోని గున్నెంపూడి, పెదమదీన, కొండపాలెం, కేపీ అగ్రహారం, బుచ్చెయ్యపేట, ఐతంపూడి, కందిపూడి, పి.భీమవరం, దిబ్బిడి, కొండెంపూడి గ్రామాలకు చెందిన చెరువుల్లో నింపడం ద్వారా సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా రూపకల్పన చేశారు. చెరువుల్లో నీరు నింపడం ద్వారా భూగర్భ నీటిమట్టం పెరిగి బోర్లు, బావుల ద్వారా అదనంగా మరో వెయ్యి ఎకరాలకు నీరందుతుందని భావించారు. రిజర్వాయర్ ప్రారంభమైన అనంతరం 2009-10 వరకూ మండలంలో ఆయకట్టు రైతాంగానికి అందిన రిజర్వాయర్ నీరు...అనంతరం పుష్కర కాలంగా నిలిచిపోయింది.

### ఇంజనీరింగ్ లోపమే కారణం

ఇంజనీరింగ్ అధికారుల అవగాహన లోపంతో రిజర్వాయర్ కుడి కాలువ నిర్మాణం లోపభూయిష్టంగా జరిగింది. మెడివాడ పెద్ద చెరువు నుంచి గొల్లలపాలెం, మొగ్గ చెరువు, మరుపాక, పిల్లవానిపాలెం మీదుగా నిర్మించిన కాలువ ద్వారా మండలంలోని గున్నెంపూడి చిన్నారి చెరువులోకి రిజర్వాయర్ నీరు చేరాలి. అయితే రావికమతం కాలువ మండల కాలువ కంటే లో లెవెల్‌లో నిర్మించడంతో చిన్నారి చెరువులోకి రిజర్వాయర్ నీరు ప్రవహించలేదు. కాలువలో నీరు ప్రవహించేలా చేపట్టిన చర్యలతో గట్టుకు గండిపడి పంటలు దెబ్బతిన్నాయి. ఫలితంగా ... మిగతా 6వ పేజీలో

# వెలుగుల మాటున చీకట్లు!



సింహాద్రి ఎన్టీపీసీకి ఆనుకుని ఉన్న మూలస్వయంభూవరం గ్రామం

## సింహాద్రి ఎన్‌టీపీసీ కాలుష్యంతో మూలస్వయంభూవరం ఉక్కిరిబిక్కిరి

- ధ్వని, వాయు కాలుష్యంతో నిత్యం నరకం
- గ్రామస్థులకు కిడ్నీ, గుండె, చర్మ సంబంధిత వ్యాధులు
- దెబ్బతిన్న పంటలు, కలుషితమైన భూగర్భ జలాలు
- గ్రామాన్ని తరలించాలని కోరినా పట్టించుకోని అధికారులు, పాలకులు

పరవాడ, జూన్ 10:

**సింహాద్రి ఎన్టీపీసీ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్నా పక్కనే ఉన్న మూలస్వయంభూవరం గ్రామానికి మాత్రం నరకం చూపిస్తోంది. ప్లాంట్ నుంచి వచ్చే ధ్వని, వాయు కాలుష్యంతో గ్రామస్థులు తల్లడిల్లిపోతున్నారు. పంటలు, పొలాలు దెబ్బతినడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమైపోయి కిడ్నీ, చర్మ సంబంధిత వ్యాధులు ప్రబలడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.**

సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టుకు ఆనుకుని కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం గ్రామం ఉంది. ఇక్కడ సుమారు వెయ్యి మందికి పైగా జీవిస్తున్నారు. 450 మందికి పైగా ఓటర్లున్నారు. గత 20 ఏళ్లుగా సింహాద్రి ఎన్టీపీసీ నుంచి వెలువడే కాలుష్యంతో వీరంతా నరకం చూస్తున్నారు. గ్రామానికి అతి సమీపంలో ఉన్న చిమ్నీల నుంచి వెలువడే బూడిద కారణంగా పరిసర ప్రాంతాల్లో గల పంటలు, చెట్లు నల్లగా మాడిపోతున్నాయి. గ్రామంపైకి బుగ్గి వచ్చి పడడంతో ఇళ్లన్నీ నల్లగా మారిపోతున్నాయి. దీనికి తోడు చిమ్నీల నుంచి వెలువడే శబ్దాల కారణంగా ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయి. దీంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ధ్వని కాలుష్యంతో వినికిడి సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. దీనికి వాయు కాలుష్యం తోడవడంతో రోగాల పాలవుతున్నారు. ముఖ్యంగా కిడ్నీ, గుండె, చర్మ సంబంధిత వ్యాధులతో పాటు కాళ్లు, చేతులు వంకర్లు తిరగడం, శ్వాసకోశ వ్యాధులు విజృంభిస్తున్నాయని చెబుతున్నారు.



కాలుష్యం ధాటికి మాడిపోయిన తాటికమ్మలు

### విన్నవించినా అంతే...

ఈ విషయాన్ని సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం, ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని భారీ శబ్దాలతో నిద్రలేనిరాత్రుళ్లు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు పచ్చికబయళ్లతో కళకళలాడే తమ గ్రామం నేడు కాలుష్యంతో కళావిహీనంగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### భూగర్భ జలాలు కలుషితం...

సింహాద్రి ఎన్టీపీసీ కాలుష్యం కారణంగా ... మిగతా 6వ పేజీలో

### కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు



సింహాద్రి కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. 20 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. చర్మంపై తెల్లని మచ్చలు వచ్చాయి. ఒక్కోసారి శ్వాస పీల్చుకోవడం కూడా కష్టతరంగా మారుతోంది. నడవలేని పరిస్థితి ఎదురవుతోంది. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలి.

- తుంపాల అప్పారావు

## రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ కన్నుమూత



తలారి రమణమ్మ (ఫైల్)

రావికమతం, జూన్ 10: రావికమతం జడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ (57) సోమవారం సాయంత్రం కన్నుమూశారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయినప్పటికీ ఫలితం లేకపోయిందని, సోమవారం సాయంత్రం తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తకోటకు చెందిన రమణమ్మ గతంలో పంచాయతీ వార్డు సభ్యురాలిగా, శివాలయం ధర్మకర్తల మండలి సభ్యురాలిగా పనిచేశారు. 2019లో వైసీపీ తరఫున జడ్పీటీసీ సభ్యురాలిగా పోటీ చేసి గెలుపొందారు. ప్రస్తుతం ఆమె చోడవరం నియోజకవర్గ వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబుకు వియ్యపురాలు కూడా. రమణమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.

# నిర్బంధానికి చెక్

- మహిళా మార్టులో ప్రతి డ్వాక్రా సభ్యురాలు రూ.200 విలువైన సరకులు కొనుగోలు చేయాలని వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధన
- అలా చేస్తేనే ఆసరా నిధులు డ్రాకు ఐకేపీ గ్రీన్ సిగ్నల్
- ప్రభుత్వం మారడంతో ఈ విషయమై ఐకేపీ ఏపీఎంను ప్రశ్నించిన టీడీపీ నాయకులు
- సరకులు కొనాల్సిన అవసరం లేదని వివరణ




మాకవరపాలెంలో మహిళా మార్ట్

మాకవరపాలెం, జూన్ 10: ఆసరా (డ్వాక్రా రుణమాఫీ) నిధులు జమ కావాలంటే మహిళా మార్ట్‌లో సరకులు కొనుగోలు చేయాలనే షరతుకు చెల్లుచీటీ పడింది. డ్వాకా మహిళలు ఎదుర్కొనే సమస్యలపై స్పందించిన టీడీపీ నాయకులు సంబంధిత అధికారిని ప్రశ్నించడంతో అసలు గుట్టు రట్టయింది. ఇందుకు సంబంధించిన వివరాలివి.

మండల కేంద్రమైన మాకవరపాలెంలో ఈ ఏడాది జనవరి ఎనిమిదో తేదీన వైఎస్సార్ మహిళా మార్ట్‌ను ఏర్పాటుచేశారు. దీనికి కోసం ప్రతి డ్వాక్రా సభ్యురాలి నుంచి రూ.250 చొప్పున ఐకేపీ సిబ్బంది వసూలు చేశారు. ఒక్క మాకవరపాలెం మండలంలోనే సుమారు 1200 మంది సభ్యుల నుంచి రూ.46 లక్షల వరకు వసూలు చేశారు. అంతేగాకుండా సంఘం సభ్యులు ప్రతి నెలా రెండు వందల రూపాయల సరకులను మహిళా మార్టులో కొనుగోలు చేయాలని ఐకేపీ సిబ్బంది ఒత్తిడి చేసేవారు. ఆసరా నిధులు రావాలంటే ప్రతి డ్వాక్రా సభ్యురాలు ఇక్కడ సరకులు కొనాల్సిందేనని చెప్పేవారు. గత్యంతరం లేక రోలుగుంట, కోటవురట్ల, మాకవరపాలెం, నాతవరం మండలాల నుంచి సభ్యులు ఇక్కడ సరకులు కొనుగోలు చేసిన అనంతరం సదరు రశీదులను ఐకేపీ కార్యాలయాలకు తీసుకువెళ్లేవారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు.

ఇదిలావుంటే, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెంది, టీడీపీ గెలుపొందడంతో మాకవరపాలెం మండల టీడీపీ నాయకులు అల్లు రామునాయుడు, రుత్తల శేషుకుమార్, పోతల రాంబాబు, దువ్వాసి వెంకటగిరి తదితరులు సోమవారం ఇక్కడి ... మిగతా 6వ పేజీలో

## క్రైం... crime news

### రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**రాంబిల్లి, జూన్ 10:** మండలంలోని ధారబోగాపురం జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు రాంబిల్లి ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు. ఆ వ్యక్తికి సుమారు 45 సంవత్సరాలు ఉండవచ్చునన్నారు. కాగితాలు ఏరుకొనే వ్యక్తి అని, చిరునామా లేని వ్యకిగా గుర్తించి పంచదార్ల వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఆ వ్యక్తి మృతదేహాన్ని ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ ముకుందరావు తెలిపారు.

### సర్వీసు వైరు మార్చుతుండగా విద్యుత్ షాక్

- స్తంభం పైనుంచి కిందపడిన హెల్పర్
- తీవ్ర గాయాలకు గురికావడంతో కేజీహెచ్‌కు తరలింపు


క్షతగాత్రుడు రమణను విశాఖపట్నం తరలిస్తున్న దృశ్యం

**నర్సీపట్నం/ కృష్ణాదేవిపేట, జూన్ 10 :** గొలుగొండ మండలం చోద్యం గ్రామంలో లైన్‌మేన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న వ్యక్తి విద్యుత్ స్తంభం పైనుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి అతని బంధువులు తెలిపిన వివరాలివి. సోమవారం ఉదయం చోద్యం గ్రామంలోని ఓ పాకలో స్వీట్లు తయారు చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగి సర్వీసు వైరు పాడైంది. దీంతో సదరు వైరును మార్చేందుకు లైన్‌మేన్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్న లింగంపేట పంచాయతీ రామచంద్రపురం గ్రామానికి చెందిన చోబ్రోలు రమణ స్తంభం ఎక్కాడు. సర్వీసు వైరు మార్చే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై ఒక్కసారిగా కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అతనిని బంధువులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్సల అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషయమంగా ఉందని వైద్య వర్గాల ద్వారా సమాచారం.

### బీరు బాటిల్‌తో దాడి: ఒకరికి గాయాలు

**బుచ్చెయ్యపేట, జూన్ 10 :** పాత కక్షల నేపథ్యంలో మండలంలోని వడ్డాదిలో సోమవారం బీరు బాటిల్‌తో దాడి చేయడంతో ఒక వ్యక్తి గాయపడినట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. పెద్దబజారు వీధిలోని వెంకటేశ్వరస్వామి నటనాలయం వద్ద కాళ్ళ జగదీష్‌పై దూది విజయ్‌కుమార్ అలియాస్ సాయి దాడి చేసినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## బుద్ద జగదీష్‌ను సత్కరించిన నేతలు


బుద్ద నాగజగదీశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

**తుమ్మపాల, జూన్ 10:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావును సోమవారం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ మేరకు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వరరావు మాట్లాడుతూ టీడీపీలో కార్యకర్తగా చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ పార్టీకి సేవలందించడం జరిగిందన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పార్టీలో సముచిత స్థానాన్ని కల్పించడంతో పాటు పలు కీలక బాధ్యతలు అప్పగించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిళ్ల ఎదుర్కొన్నప్పటికీ ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తల సహకారంతో కృషి చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కె.జగన్, మళ్ల శివన్నారాయణ, మళ్ల గణేష్, బి.మురళీ పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసిన అనిత


చంద్రబాబునాయుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే వి.అనిత

**నక్కపల్లి, జూన్ 10 :** పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడిని సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చంద్రబాబు నాయుడు బుధవారం సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో అభినందనలు తెలిపారు. అదేవిధంగా పాయకరావుపేట ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన అనితను చంద్రబాబునాయుడు అభినందించారు. అనంతరం వంగలపూడి అనిత మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడిని హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిసి ఘనంగా సత్కరించారు.

## 'ఏపీఎల్' సీజన్-3 నూతన లోగో ఆవిష్కరణ

- ఆరు జట్లు, 19 మ్యాచ్‌లు
- ఈ నెల 30 నుంచి ప్రారంభం



లోగోను ఆవిష్కరిస్తున్న శ్రీకర్ భరత్, రిక్కీ బుయ్, నితీష్‌కుమార్‌రెడ్డి

**విశాఖపట్నం (స్పోర్ట్సు), జూన్ 10:** ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-3 నూతన లోగోను టీమిండియా క్రికెటర్ శ్రీకర్ భరత్, ఐపీఎల్ ఆటగాళ్లు రిక్కీ బుయ్, నితీష్ కుమార్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. 'మన ఆంధ్ర, మన ఏపీఎల్' నినాదంతో ఈ నెల 30 నుంచి జూలై 13వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో ఆరు ఫ్రాంచైజర్ జట్లు పాల్గొంటాయి. బెజవాడ టైగర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్, కోస్టల్ రైడర్స్ మధ్య 19 మ్యాచ్‌లు జరగనున్నాయి. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో 12, కడప స్టేడియంలో ఏడు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఈ ఏడాది జరిగిన ఏపీఎల్ ఆటగాళ్ల వేలంలో రైజింగ్ స్టార్స్ పేరిట మారుమూల ప్రాంతాలలోని ప్రతిభ గల 21 మంది క్రికెటర్లను గుర్తించి అవకాశం కల్పించామని ఏసీఏ కార్యదర్శి గోపీనాథరెడ్డి పేర్కొన్నారు. ఐపీఎల్‌తోపాటు దేశవాళీ టోర్నీలలో ఆంధ్ర క్రికెటర్లకు అవకాశం దక్కేందుకు ఏపీఎల్ ఒక ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుందని, ఫ్రాంచైజర్లు ఏపీఎల్ ఆటగాళ్లకు ఐపీఎల్ ఆటగాళ్ల తరహాలో అన్ని సదుపాయాలు కల్పించడం ఆహ్వానించదగ్గ విషయమని క్రికెటర్లు భరత్, రిక్కీబుయ్, నితీష్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | రూ.లలో |
|---|---|
| రైతు ధర | 125.00 |
| లైవ్ ధర | 145.00 |
| విత్ స్కిన్ | 260.00 |
| స్కిన్ లెస్ | 270.00 |

**కోడి గుడ్లు (నెక్)**

| వంద గుడ్లు | రూ.లలో |
|---|---|
| విశాఖపట్నం | 450 |
| విజయనగరం | 454 |
| శ్రీకాకుళం | 454 |

# ప్రయాణం.. ప్రమాదం..!

- పింద్రంగి-లంకెవన్నెపాలెం రహదారి మధ్య నల్లరాయి క్వారీ గోతులు
- 50 అడుగుల లోతున ఉంటుండడంతో పలువురు భయాందోళన
- రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి


దాలివలస నుంచి పింద్రంగి- లంకెవన్నెపాలెం గ్రామాలకు వెళ్లే రహదారి

**కె.కోటపాడు, జూన్ 10 :** మండలంలోని పింద్రంగి- లంకెవన్నెపాలెం రహదారి మధ్య ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ గ్రామాలకు వెళ్లే మార్గంలో ఇరువైపులా నల్లరాయి క్వారీ గోతులు ఉన్నాయి. రోడ్డు పక్కనే ఇవి యాభై అడుగుల లోతున ఉండడంతో చూసినవారు హడలిపోతున్నారు. ఆయా చోట్ల కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయాందోళన చెందుతున్నారు. పింద్రంగి నుంచి లంకెవన్నెపాలేనికి వెళ్లే మార్గమధ్యలో నల్లరాయి కోసం క్వారీ తవ్వకాలను చేపట్టారు. రోడ్డుకు ఆనుకుని తవ్వకాలు చేపట్టడం, ఈ క్వారీ వద్దే రోడ్డు మలుపు ఉండడంతో వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెనుప్రమాదం తప్పదని అంటున్నారు. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని పలువురు గుర్తుచేస్తున్నారు. కె.కోటపాడు నుంచి దాలివలస మీదుగా పింద్రంగి, లంకెవన్నెపాలెం నుంచి విజయనగరం జిల్లా ఎల్.కోట, కొత్తవలసకు దగ్గర మార్గం కావడంతో చాలా మంది వాహనదారులు ఇటుగా ప్రయాణాలు సాగిస్తుంటారు. అంతేకాకుండా లంకెవన్నెపాలెం, పింద్రంగి చుట్టు పక్కల గ్రామాలవారు కూరగాయలు, సీజనల్‌గా పండే ఫలాలను సైతం విక్రయించేందుకు మండల కేంద్రం కె.కోటపాడులోని కె.సంతపాలెం రైతుబజారుకు రైతులు ఎక్కువగా ఇటుగానే తీసుకువస్తుంటారు. దీంతో ఆటోలు, వ్యాన్లు, బైకులతో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో లోతైన క్వారీ తవ్వకాలు ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇక్కడ కనీసం రక్షణ గోడలు నిర్మించే ఏర్పాట్లను అధికారులు చేయకపోవడం దారుణమని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు ఈ రహదారిలో ఎలాగోలా రాకపోకలు చేయవచ్చునని, రాత్రి సమయాల్లో కొత్తవారు ఇటుగా వస్తే జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి క్వారీ గోతులు ఉన్న ప్రాంతాల్లో ఎత్తైన రక్షణ గోడలు నిర్మించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే ఉన్న భారీ క్వారీ గొయ్యి

# మందకొడిగా అమృత భారత్ రైల్వే పనులు


ప్లాట్‌ఫారంపై షెడ్లు నిర్మాణానికి చేపడుతున్న దృశ్యం


ప్లాట్‌ఫారాలపై వెయింటింగ్ హాల్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

- పది నెలలైనా పూర్తి స్థాయిలో ప్రారంభం కాని వైనం
- అతీగతీ లేని రిజర్వేషన్ కమ్ బుకింగ్ కౌంటరు, మరో భవనం, కాలినడక వంతెన, ఎస్కలేటర్ పనులు

**అనకాపల్లి టౌన్, జూన్ 10 :** అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో అమృతభారత్ పథకం పనులు కొన..సాగుతూ వస్తున్నాయి. గతేడాది ఆగస్టు 6వ తేదీన దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్‌నల్లో అమృతభారత్ పథకం పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. పది నెలలు దాటినా పనులు మాత్రం వేగవంతం కాలేదు. ప్రస్తుతం అధికారులు పనులు చేపట్టడంలో నిమగ్నమయ్యారు. అనకాపల్లి స్టేషన్ అభివృద్ధికి అమృతభారత్ పథకం కింద రూ.27.3 కోట్లు మంజూరయ్యాయి. శంకుస్థాపన సమయంలో అప్పటి ప్రజాప్రతినిధులు ఏడాది కాలంలో అభివృద్ధి పనులు పూర్తవుతాయని ప్రకటన కూడా చేశారు. మరో రెండు నెలలు గడిస్తే శంకుస్థాపన జరిగి ఏడాది పూర్తవుతుంది. ఈ పథకం కింద అనకాపల్లి రైల్వేస్టేషన్ రూపురేఖలే మారిపోతాయి. ప్రస్తుతమున్న ప్రధాన ముఖద్వారం వద్ద అతి పెద్ద భారీ భవనం నిర్మాణం కానుంది. ప్రస్తుతమున్న రిజర్వేషన్ కమ్ బుకింగ్ కౌంటరుకు తూర్పు భాగంలో ఒక కాలినడక వంతెన, ఎస్కలేటర్ ప్రయాణికుల సౌకర్యార్థం అందుబాటులోకి రానున్నాయి. అయితే ఈ పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. స్టేషన్‌లోని మూడు ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులు ఎండకు, వానకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉండేలా ప్లాట్‌ఫారాల అంతటా షెడ్లు నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే వీటి పనులు ప్రారంభమయ్యాయి. రెండు, మూడు ప్లాట్‌ఫారాల మధ్య రైళ్ల వచ్చే వరకు విశ్రాంతి తీసుకోవడానికి వెయింటింగ్ హాల్స్, అధునాతనమైన బాత్‌రూమ్‌ల నిర్మాణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. అలాగే సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన పనులు కొనసాగిస్తున్నారు. ప్లాట్‌ఫారాలన్నింటినీ అధునాతనమైన టైల్స్‌తో తీర్చిదిద్దే పనులు చేపడుతున్నారు. అంతేకాకుండా ప్రయాణికులకు అవసరమయ్యే సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై పూర్తిస్థాయిలో షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎస్కలేటర్, కాలినడక వంతెన, వృద్ధులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసే లిఫ్టు సౌకర్యం పనులు ప్రారంభం కావాల్సి ఉంది. సాధారణంగా రైల్వే శాఖ అభివృద్ధి పనులు ప్రారంభిస్తే ఏడాదిలో పూర్తవుతాయన్నది ప్రజల్లో నమ్మకం. అయితే పది నెలలు కావస్తున్నా స్టేషన్‌లో అభివృద్ధి పనులు 50 శాతం కూడా పూర్తికాలేదు. ఈ విషయమై స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్ వద్ద ప్రస్తావించగా.. దశలవారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వెయింటింగ్ రూమ్‌లు, టాయిలెట్స్, షెడ్ల నిర్మాణాలు, సిగ్నలింగ్ సిస్టమ్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్లాట్‌ఫారాలపై మొజాయిక్ పనులు వేగవంతం చేశామని, తొందరలోనే రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తవుతాయని చెప్పారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా స్టేషన్‌ను అభివృద్ధి పరిచేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

# రాష్ట్రంలో దుర్మార్గ పాలనకు చరమగీతం పాడిన ఓటర్లు

- గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థ సర్వనాశనం
- ప్రస్తుతం రాష్ట్రంలో విద్యకు మంచి రోజులు
- ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

**కొత్తూరు(అనకాపల్లి), జూన్ 10 :** రాష్ట్రంలో గత ఐదేళ్ల దుర్మార్గ, మొండి, ఏకపక్ష, కక్ష్య సాధింపు ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు చరమగీతం పాడారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు పాకలపాటి రఘువర్మ అన్నారు. అనకాపల్లి పట్టణంలోని ఏపీటీఎఫ్ కోలపర్తి అప్పారావు భవనంలో సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువంటే రంగులు వేయడం, భవనాలు, బోర్డు పెట్టడమనే భావనలో ప్రభుత్వం నడిచిందన్నారు. ఒక వైపు విద్యను నిర్వీర్యం చేస్తూ గొప్ప గొప్ప ప్రకటనలతో కాలం గడిపారన్నారు. చెత్త అధికారులు, దోచుకు తినడానికి వచ్చిన సలహాదారులతో విద్యాశాఖ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. ప్రాథమిక విద్య పూర్తిగా సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని ప్రయోగాలతో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు గణనీయంగా తగ్గిపోయారన్నారు. విద్యా రంగ నిపుణులను సంప్రదించకుండా, ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులకు తెలియకుండా నిర్ణయాలన్నీ జరిగిపోయాయన్నారు. చివరికి మాట్లాడితే అరెస్టులు, నోటీసులు, బెదిరింపులు, భయపెట్టడానికి కూడా దిగారన్నారు. ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో ఒక డిక్టేటర్ పాలన సాగిందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. విద్యా రంగానికి ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఈ ప్రభుత్వం చేసిన అన్యాయాలపై ఏ చర్చకైనా తాను సిద్ధమన్నారు. గత ప్రభుత్వం, పాలకుల వద్ద మెప్పు కోసం ప్రవీణ్ ప్రకాష్ వంటి అధికారులు ఉపాధ్యాయులను గందరగోళానికి, భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఇప్పుడు రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే ఆశాభావం ఉందన్నారు. మెగా డీఎస్సీని వెంటనే ప్రకటిస్తారని చెప్పారు. ఆయన హామీ ఇచ్చిన విధంగా 117 జీవోను వెంటనే రద్దు చేస్తారన్నారు. అలాగే మరలా గ్రామాల్లోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతులు నిర్వహిస్తారన్నారు. 117జీవోలో అన్యాయం జరిగిన ఉపాధ్యాయులకు న్యాయం చేస్తారన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.వెంకటపతిరాజు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు విద్యపై ఎటువంటి సూచనలు చేసినా కొత్త ప్రభుత్వం అన్ని వర్గాలతో చర్చించే నిర్ణయం తీసుకోవాలని కోరారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలా తొందరపాటు, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడా భాగమేనని గుర్తించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్యారంగం, పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేకేఎల్ఎస్ ధర్మారావు, చిరికి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, డి.నూకరాజు, కూండ్రపు సత్యనారాయణ, బలరాం, గణపతి, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

### మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

**విశాఖపట్నం, జూన్ 10:** విజయవాడ డివిజన్ పరిధిలో నిర్మాణ పనులు జరుగుండడంతో పలు రైళ్లను ప్రత్యామ్నాయ మార్గంలో రప్పించాలని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 10, 11, 17, 18, 24, 25 తేదీల్లో ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); ఈనెల 14, 21, 26వ తేదీల్లో బెంగళూరు-గువహటి ఎక్స్‌ప్రెస్ (12509); ఈనెల 11, 18, 25వ తేదీల్లో సికింద్రాబాద్-షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774); ఈనెల 11, 14, 15, 17, 18, 21, 22, 24, 25, 28, 29 తేదీల్లో ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఈనెల 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806) రైళ్ల వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు (11019) ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు (12806) నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

### 16న జిల్లా స్విమ్మింగ్ చాంపియన్ షిప్

**విశాఖపట్నం (స్పోర్ట్సు):** బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో ఈ నెల 16న జిల్లా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ కమ్ జిల్లా జట్టు ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా స్విమ్మింగ్ సంఘం కార్యదర్శి మోహన్ వెంకటరామ్ తెలిపారు.

## సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు 70 శాతం రాజీనామా

- మిగిలినవారు ససేమిరా.. వచ్చే నెలాఖరు వరకూ గడువు
- ఆచితూచి వ్యవహరిస్తున్న సహకార శాఖ అధికారులు

**విశాఖపట్నం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలతో జిల్లాలో 70 శాతం సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు రాజీనామా చేశారు. జిల్లాలో 98 సహకార సంఘాలు ఉండగా గత ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జులను నియమించారు. ఇంకా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలక వర్గానికి చైర్‌పర్సన్ ఇన్‌చార్జులను నియమించారు. ఆరు నెలలకు ఒకసారి వీరి పదవీకాలం పొడిగిస్తూ వచ్చింది. వచ్చే నెలాఖరు వరకూ గడువు ఉంది. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో ప్రధాన కార్యదర్శి ఆదేశాలతో డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు మూడు రోజుల క్రితమే తన పదవికి రాజీనామా చేశారు.

అయితే ఉమ్మడి జిల్లాలో 98 సొసైటీల్లో 70 సంఘాల పర్సన్ ఇన్‌చార్జులు తమ పదవులకు రాజీనామా చేయగా మిగిలిన వారు ససేమిరా అంటున్నారు. తమకు నోటీసులు ఇస్తే పదవుల నుంచి వైదొలగుతామని చెప్పడంతో సహకార శాఖ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. వచ్చే నెలాఖరు వరకు మాత్రమే పదవీకాలం ఉన్నందున అప్పటివరకూ వేచి ఉండాలని భావిస్తున్నారు.

### మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

**విశాఖపట్నం, జూన్ 10:** విజయవాడ డివిజన్ పరిధిలో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. ఈనెల 10, 11, 17, 18, 24, 25 తేదీల్లో ఎర్నాకులం-పాట్నా ఎక్స్‌ప్రెస్ (22643); ఈనెల 14, 21, 26వ తేదీల్లో బెంగళూరు-గువహటి ఎక్స్‌ప్రెస్ (12509); ఈనెల 11, 18, 25వ తేదీల్లో సికింద్రాబాద్-షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774); ఈనెల 11, 14, 15, 17, 18, 21, 22, 24, 25, 28, 29 తేదీల్లో ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఈనెల 11, 12, 15, 16, 18, 19, 22, 23, 25, 26, 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806) రైళ్ల వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి. కాగా , ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు (11019) ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో; లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు (12806) నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లలో హాల్ట్ ఉండదని పేర్కొన్నారు.

### మార్కెట్ కమిటీ సభ్యుల రాజీనామా


రాజీనామా పత్రాన్ని కార్యదర్శికి అందిస్తున్న సభ్యులు

**మాడుగుల, జూన్ 10:** వైసీపీ హయాంలో నిమామకమైన మాడుగుల మార్కెట్ కమిటీ సోమవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. పది మందితో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో చైర్మన్‌గా సేనాపతి కొండలరావు కొనసాగేవారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నిల్లో వైసీపీ ఓటమి చెందిన నేపథ్యంలో పాలకవర్గ సభ్యులు తమ పదవులకు రాజీనామాలు చేసి, సదరు పత్రాలను మార్కెట్ కమిటీ కార్యదర్శి బంగార్రాజుకు అందజేశారు.

### కో-ఆపరేటివ్ బ్యాంకు త్రీమెన్ కమిటీ రాజీనామా

మాడుగుల కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా ఉన్న పెరుమాళ్ల వెంటకరావు సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ హయాంలో త్రీమెన్ కమిటీని నియమించారు. ప్రస్తుతం ఆ పార్టీ ఎన్నికల్లో ఓటమి చెందడంతో పెరుమాళ్లతో పాటు డైరెక్టర్లు గండి సుభద్ర, పాతరపిల్లి వెంకటరమణ కూడా రాజీనామా చేశారు.

### పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

**కశింకోట, జూన్ 10:** స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.బాలాజీ సోమవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని రికార్డులను తనిఖీ చేశారు. పీఎంవైకే కార్యక్రమానికి ఎంత మంది గర్భిణులు వచ్చారో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతిరావు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### కల్కి చిత్రం ట్రైలర్ విడుదల


ట్రైలర్ ప్రారంభోత్సవ కేకు కట్ చేస్తున్న అభిమానులు

**అనకాపల్లి టౌన్, జూన్ 10 :** స్థానిక సత్యనారాయణ థియేటర్‌లో ప్రముఖ హీరో ప్రభాస్ నటించిన కల్కి చిత్రం ట్రైలర్‌ను విడుదల సోమవారం రాత్రి అభిమానుల కోలహాలం మధ్య విడుదల చేశారు. ఈ చిత్రం ఈ నెలాఖరున విడుదల కానున్న సందర్భంగా అనకాపల్లి పట్టణ ప్రభాస్ అభిమానులు ఈ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా థియేటర్ ఆవరణలో రాష్ట్ర స్థాయి ప్రభాస్ ఫ్యాన్స్ కార్యవర్గసభ్యులు జీవీఎల్ఎన్ రాజు, కాండ్రేగుల జోగేంద్ర, ప్రవీణ్ సమక్షంలో థియేటర్ అధినేత కొణతాల రామలింగస్వామి కేకును కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కొణతాల అరవింద్, అశోక్, సతీష్‌వర్మ, శివయ్య, బుద్ద మనోహర్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### జేఈఈలో మంచి ర్యాంకు రాలేదని విద్యార్థి ఆత్మహత్య

**ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), జూన్ 10:** ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మంచి ర్యాంకు రాలేదన్న కారణంతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...సెక్టార్-లో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు కుమారుడు సుజిత్ కుమార్ (17) ఇంటర్ పూర్తిచేశాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి, త్రివేండ్రంలోని ఐఐఎస్‌టీలో చేరాలనుకున్నాడు. ఆశించిన ర్యాంకు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం తన ఇంటి టెర్రస్ పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## హెరిటేజ్ రైతుకు నగదు పంపిణీ

**అచ్యుతాపురం రూరల్, జూన్ 10 :** మండలంలోని కొండ కర్లలో హెరిటేజ్ డెయిరీ రైతు బిల్లా జగ్గారావుకు సోమవారం మేనేజరు కూండ్రపు శేషు రూ.50 వేలను అందజేశారు. జగ్గారావు పాడి ఆవు మరణించడంతో డెయిరీ నుంచి నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతీ రైతు సంక్షేమానికి తమ డెయిరీ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలసంఘం అధ్యక్షుడు బి.శివ, పాడి రైతులు బి.జగ్గారావు, పి.శ్రీను, ఎస్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు రూ. 50 వేలు ఆర్థిక సాయం

**పరవాడ, జూన్ 10 :** ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో ఇటీవల వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో జాలారిపేటకి చెందిన కంబాల ముత్యాలు, దిబ్బపాలెం గ్రామానికి చెందిన చింతకాయల అప్పన్న మృతి చెందారు. స్థానిక సర్పంచ్, జనసేన నాయకురాలు చింతకాయల సుజాత మృతుల ఒక్కొక్క కుటుంబానికి రూ. 25వేలు చొప్పున నగదును సోమవారం రాత్రి స్థానిక నాయకుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, అర్జిల్లి రవి, చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు పౌష్టికాహారం

**పాయకరావుపేట, జూన్ 10 :** పాయకరావుపేట పీహెచ్‌సీకి సోమవారం వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు దాతల సాయంతో 60 మంది గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు ఆర్.ప్రకాష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు విజయ, కట్టమూరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పరవాడ, జూన్ 10 :** స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని 220 కేవీ టవర్ లైన్ నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గొర్లివానిపాలెం, పోర్టుకో కాలనీ, జాజులవానిపాలెం, పవర్ సిటీ, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ఉక్కు కష్టాలు తీరేనా?

... 3వ పేజీ తరువాయి

అవసరమైన నిధులు, ముడిపదార్థాలు లేవు. రాష్ట్రం ఏర్పాటయ్యాక కేంద్రంలో ఉక్కు శాఖా మంత్రి పదవి తొలిసారి లభించింది. దక్షిణ భారతదేశంలో తీర ప్రాంతానున్న ఏకైక ప్రభుత్వ కర్మాగారం ఇదే. ఇక్కడ ఏడాదికి 80 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా రూ.50 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్టీ ద్వారా 18 శాతం అంటే రూ.9 వేల కోట్లు ఆదాయం వస్తుంది. ఇవన్నీ జరగాలంటే స్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన నిర్వహణ మూలధనం సమకూర్చాలి. బ్యాంకుల నుంచి రుణం దొరకడానికి రాష్ట్రపతి పేరిట ఉన్న ఉక్కు భూములను ఆర్ఐఎన్ఎల్ పేరిట మార్పించాలి. అప్పుడే సంస్థకు ఆర్థిక పరపతి పెరిగి మార్కెట్‌లో రుణాలు లభిస్తాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనివల్ల మంచి జరుగుతుంది. మంత్రి మనవారే కావడం వల్ల ఇవన్నీ సులువు అవుతాయని విశాఖ ఉక్కు అధికార, కార్మిక సంఘాలు భావిస్తున్నాయి.

**కార్గో విమాన సర్వీసులకు అవకాశం**

కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు పౌర విమానయాన శాఖ రావడం పట్ల ఏపీ విమాన ప్రయాణికుల సంఘం హర్షం వ్యక్తంచేసింది. విశాఖపట్నానికి ఎప్పటి నుంచో కార్గో విమాన సర్వీసులు లేవు. ఇక్కడి నుంచి విదేశాలకు సముద్ర ఉత్పత్తులు, మందులు, దుస్తులు, ఇతర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. అయితే ప్రత్యేకంగా కార్గో విమానాలు లేకపోవడం వల్ల సముద్ర మార్గాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. దీనికి ఎక్కువ సమయం పడుతోంది. వ్యయం అవుతోంది. మంత్రి ఈ ప్రాంతానికి చెందినవారే కావడం వల్ల కార్గో విమాన సర్వీసులు వీలైనంత త్వరగా తెచ్చుకునే వీలుంది. అంతేకాకుండా రద్దయిన దుబాయ్, శ్రీలంకతో పాటు ఇతర విదేశాలకు కొత్త సర్వీసులు తెచ్చుకోవచ్చు. అదేవిధంగా భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం మరింత త్వరగా అందుబాటులోకి తెచ్చుకునే వీలుంది. ఈ ఇద్దరు మంత్రుల వల్ల విశాఖకు మేలు జరుగుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు.

## నిర్బంధానికి చెక్

... 3వ పేజీ తరువాయి

ఐకేపీ కార్యాలయానికి వెళ్లారు. ఏపీఎం చినబాబుతో ఈ విషయమై చర్చించారు. మహిళా మార్ట్‌లో డ్వాక్రా మహిళలు విధిగా సరకులు కొనాలనే నిబంధన ఏమైనా ఉందా..అని ప్రశ్నించారు. దీనికి ఏపీఎం అటువంటి నిబంధన లేమీ లేదని స్పష్టం చేశారు. ఇకపై మహిళా మార్ట్‌లో డ్వాక్రా మహిళలకు సరకులు కొనాలనే షరతు విధిస్తే సహించేది లేదని చెప్పారు.

కాగా, మండలంలోని వివిధ గ్రామాల నుంచి 30 డ్వాకా సంఘాల మహిళలు సోమవారం ఆసరా నిధులు బ్యాంకు నుంచి డ్రా చేసేందుకు ముందు మాకవరపాలెంలోని వెలుగు కార్యాలయానికి వచ్చారు. వీరంతా మహిళా మార్ట్‌లో సరకులు కొనుగోలు చేయలేదు. దీంతో ఆసరా నిధుల డ్రా తీర్మానం కాపీపై ఐకేపీ ఏపీఎం సంతకాలు చేస్తారో...లేదోనని వారంతా సందేహించారు. టీడీపీ నాయకులు అక్కడే ఉండడంతో ఏపీఎం సంతకాలు చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.





# వాడవాడలా కూటమి విజయోత్సవాలు



అచ్యుతాపురం రూరల్: ఎమ్మెల్యే సుందరపును సన్మానిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ



రాంబిల్లి: ప్రధానిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారంతో విజయోత్సవాలు

**రాంబిల్లి, జూన్ 10:** జిల్లాలో ఎన్డీయే కూటమి విజయోత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం, గెలుపొందిన శాసన సభ్యులను అభినందించిన కార్యక్రమాలను కూటమి నేతలు నిర్వహించారు. ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయమార్‌ను అచ్యుతాపురం జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం కూటమి నేతలు ధూళి రంగనాయకులు, వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు సుందరపు లోవరాజు, ఉరిటి నానాజీ, నానేపల్లి సన్యాసిరావు, సుందరపు రాంబాబు పాల్గొన్నారు.

**'ప్రగడ'ను కలిసిన టీడీపీ నేతలు**

సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే, ఎంపీల విజయానికి కృషి చేసిన టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావును సోమవారం సీనియర్ టీడీపీ నాయకులు ఎరుపల్లి చిట్టిబాబు, చెల్లూరి ఆనంద్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

**మోదీ ప్రమాణ స్వీకార సంబరాలు**

ప్రధానిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేయడంతో సోమవారం మండల కేంద్రంలో కూటమి నేతలు విజయోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా కూటమి నేతలు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలిదిండి రఘురాజు, బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు, కూటమి నేతలు గిరిరాజు, చింతకాయల ఎర్రయ్య ధర్మాల గోవిందరెడ్డి, ఉమ్మిడి వెంకటేశ్వరులు, ఎరుపల్లి సోమేష్, నాగమంత్రి శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే విజయకుమార్‌కు అభినందనలు**

**ఎలమంచిలి:** ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను సోమవారం ఎలమంచిలికి చెందిన నేతలు, ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. అచ్యుతాపురంలోని ఆయన స్వగృహంలో మునిసిపాలిటీకి చెందిన పిట్టా శ్రీను, బొద్దపు శ్రీను, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు గుర్రాల నగేష్, పలువురు ఉపాధ్యాయులు, మునిసిపల్ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**ఎమ్మెల్యే పంచకర్లకు..**

**సబ్బవరం:** భారీ మెజారిటీతో గెలుపొందిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబును తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు వీబీవీఎస్ఎన్ రాజు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ.. పెందుర్తి నియోజకవర్గంలో తన గెలుపు కోసం కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

**రైతులకు వ్యసాయాధికారులు అందుబాటులో ఉండాలి**

ఖరీఫ్‌లో రైతులకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. సోమవారం ఆయన్ని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు, అనకాపల్లి సబ్ డివిజన్ అధికారి ఎం. రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పరవాడ, సబ్బవరం ఏవోలు సీహెచ్ చంద్రావతి, పోతల సత్యనారాయణ, ఏఈవోలు బాలరాజు, పి సంజీవరావు పాల్గొన్నారు.

**సుందరపును సన్మానించిన డీఈఓ**

**అచ్యుతాపురం రూరల్ :** ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ సోమవారం ఆయన నివాసంలో శాలువా కప్పి అభినందించారు. అలాగే ఎలమంచిలి పరిధిలోని నాలుగు మండలాల పరిధిలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆయనను కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో దేవ రాయల్, ఉపాధ్యాయులు మోటూరు, త్రినాథస్వామి, వెంటేశ్వరరావు పాల్గొన్నారు.

**హరిపాలెంలో విజయోత్సవ ర్యాలీ**

మండలంలోని హరిపాలెంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యం సోమవారం రాత్రి విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఎన్‌టీఆర్ విగ్రహం వద్దకు నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచారు.

**ఘనంగా మోదీ ప్రమాణ స్వీకార సంబరాలు**

ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు కేక్ కట్ చేసి, స్వీట్స్ పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొరుపోలు చిన్నారావు, చుక్క అనురాధ, కె.నాయుడు బాబు, మేరుగు కాసుబాబు, కేవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.



రాంబిల్లి: ప్రగడను సత్కరిస్తున్న టీడీపీ నేతలు



సబ్బవరం: పంచకర్లను సత్కరించిన వ్యవసాయాధికారులు



హరిపాలెంలో కూటమి నేతల విజయోత్సవం

# ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు



అనకాపల్లిలో బాలకృష్ణ జన్మదిన కేకును కట్ చేస్తున్న రత్నాకర్



పాయకరావుపేటలో బాలకృష్ణ బర్త్ డే వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

**కొత్తూరు, జూన్ 10 :** సినీ హీరో, నటరత్న నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పార్కు సెంటర్ వద్ద సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పాల్గొని జన్మదిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ స్థాపించిన బసవరామ తారకం క్యాన్సర్ ఆసుపత్రిని ప్రపంచం గర్వించదగ్గ స్థాయికి బాలకృష్ణ తీసుకువెళ్లారని కొనియాడారు. అనంతరం రత్నాకర్‌ను పట్టణ బాలకృష్ణ అభిమానులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు పెతకంశెట్టి శ్రీనివాసరావు, పొలిమేర నాయుడు, కరణం శ్రీను, డీవీ.రావు, సూరిశెట్టి నూకరాజు, అప్పలనాయుడు, సత్యారావు, కోట్ని ఉమ, బాలకృష్ణ అభిమానులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పాయకరావుపేటలో..** ప్రముఖ సినీ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు సోమవారం స్థానిక శ్రీలక్ష్మి థియేటర్ ఆవరణలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కేక్‌ను కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు బొండి కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, లెక్కల గోవిందు, రావాడ గోవిందరెడ్డి, పల్లా విలియంకేరి, జూరెడ్డి ప్రసాద్, నందమూరి కల్చరల్‌యూత్ నాయకుడు విశ్వనాథుని శ్రీను, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో సినీ హీరో నందమూరి బాలకృష్ణ బర్త్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవవరపు ఆనంద్, గొల్లపల్లి నాగు, తలారి రాజా, పడాల కోటి, బజంత్రీల శివ తదితరులు పాల్గొన్నారు.

**మునగపాకలో..** ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం మునగపాకలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర రైతు కార్యదర్శి దాడి ముసిలినాయుడు కార్యకర్తల సమక్షంలో కేకును కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి శివ, పెంటకోట శ్రీరామ్మూర్తి, వెలగా మురళీ, బి.లక్ష్మణరావు, ఆడారి అబ్బాయి, బొడ్డేడ రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కార్పెంటర్ల సంక్షేమమే ధ్యేయం

**» ఏపీ కార్పెంటర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి**

**పాయకరావుపేట, జూన్ 10 :** కార్పెంటర్ల సంక్షేమంతో పాటు వారి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని ఏపీ కార్పెంటర్స్(వడ్రంగి) అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి నరసింహమూర్తి అన్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా సోమవారం మండల కార్పెంటర్ల సంఘం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో ఆయనను పలువురు సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు రాష్ట్ర నాయకులు, ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం అధ్యక్షుడు కొప్పోజు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు గానుగుల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి దివిలి వరహాలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింహాద్రి నరసింహమూర్తి, స్థానిక సంఘం నాయకులు రామోజు నాగేశ్వరరావు, రంగాచారి, అలుగోలు రమణ, గునుపూడి సత్తిబాబు, కొత్తల శ్రీను తదితరులు పాల్గొన్నారు.




నరసింహమూర్తిని అభినందిస్తున్న కార్పెంటర్ల సంఘం నాయకులు

## ఇసుక డిపోలు మూత

... 3వ పేజీ తరువాయి

జిల్లాలో డిపోలు మూత పడడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు అవసరం పేరుతో రాత్రి, పగలు తేడా లేకుండా నదుల్లో అనధికారంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ టైరు బండ్లపై రవాణా చేస్తోంది. అనకాపల్లి, చోడవరం మండలాల సరిహద్దు ప్రాంతాల్లో శారద, పెద్దేరు, బొడ్డేరు నదుల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. చోడవరం మండలం గజపతినగరం, జుత్తాడ, గవరవరం, దేవరాపల్లి మండలం తిమిరాం, కలిగొట్ల, పెద్దేరు పరిధిలో గౌరీపట్నం, వి.మాడుగుల మండలం వాడపాడు, సాగరం, ఎలమంచిలి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో వరహా నదిలో దార్లపూడి గ్రామంలో స్థానిక అవసరాల పేరుతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఇసుక డిపోలు మూతపడిన మాట వాస్తవమేనని, కొత్త ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం త్వరలోనే నూతన ఇసుక పాలసీ అమలులోకి వస్తుందని గనుల శాఖ జిల్లా అధికారి సుబ్బారాయుడు తెలిపారు. నదుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టంచేశారు.

## వెలుగుల మాటున చీకట్లు!

... 3వ పేజీ తరువాయి

పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలన్నీ కలుషితమయ్యాయి. బావుల్లో నీరు పనికిరాకుండా పోతోంది. పశువులకు నీరందించడం కూడా కష్టంగా మారుతోందని రైతులు వాపోతున్నారు. కొన్నిచోట్ల చేతి పంపు నీరు ఉప్పునీటిగా మారిపోయింది. దీంతో గ్రామస్థులు తాగునీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తాగునీటిని సరఫరా చేయాలని సింహాద్రి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోలేదని, పరవాడ, చీపురుపల్లి నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని తెలిపారు.

**పట్టించుకోని పాలకులు, అధికారులు**

కాలుష్యంతో ఏళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని, దీంతో దుర్భర జీవనం గడుపుతున్నామంటున్నారు. కాలుష్యం కారణంగా ప్రబలిన రోగాలతో ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారని, మరింతమంది ప్రాణాలు పోయేలోగా పరిష్కార మార్గాన్ని చూపాలని కోరుతున్నారు. ఎన్టీపీసీ నిర్మాణం కోసం భూములు కోల్పోయామని, పరిశ్రమ వస్తే తమ జీవితాలు బాగుపడతాయని భావించామని, కానీ ప్రస్తుతం జీవించే పరిస్థితే కనిపించడం లేదంటున్నారు.

## పెద్దేరుపై చిన్నచూపు

... 3వ పేజీ తరువాయి

రిజర్వాయర్ అధికారులు మండలంలో సాగుకు నీరందించే పరిస్థితి లేక చేతులెత్తేశారు.

**కాలువల ఆధునికీకరణే మార్గం**

రిజర్వాయర్ కాలువను ఆధునికీకరిస్తే తప్ప ఆయకట్టుకు నీరందే అవకాశం లేదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో 13 సంవత్సరాలుగా పెద్దేరు రిజర్వాయర్ నీరు అందడం లేదు. దీనిపై చర్యలు తీసుకోవాలని రైతులు చేసిన విజ్ఞప్తులు పట్టించుకునే నాథుడే లేకపోవడంతో రైతులకు వరుణ దేవుడే దిక్కయ్యాడు. తరచూ వర్షాభావంతో పంటలు దెబ్బతిని ఆర్థికంగా కుదేలవుతున్నాడు.పంట నష్టాలు తప్పకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కురుకుపోతున్నారు.

**బూడి...మాటల హడావుడి**

పెద్దేరు రిజర్వాయర్ అభివృద్ధికి రూ.84.4 కోట్లు మంజూరైనట్టు గత మార్చిలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విప్ కరణం ధర్మశ్రీలు చేసిన ప్రకటన మండల రైతుల్లో ఆశలు చిగురింపజేసింది. ఈ నిధులతో రిజర్వాయర్ అభివృద్ధితో పాటు రూ.40 కోట్లతో ఆర్ఎంసీ, ఎల్ఎంసీ చానల్స్ సీసీ కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేపడతామని ప్రకటించారు. దీంతో ఆనందించిన రైతులు వేలాది ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. వర్షాభావ పరిస్థితి తప్పకపోవడంతో పది గ్రామాల్లో వేలాది ఎకరాలు ఖరీఫ్ సాగు దెబ్బతింది.

## పాత కోర్టు భవనాన్ని పరిశీలించిన జిల్లా జడ్జి



కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

**అనకాపల్లి టౌన్, జూన్ 10:** స్థానిక నెహ్రూచౌక్‌కు సమీపంలోని పాత కోర్టు భవనాన్ని అనకాపల్లి జిల్లా జడ్జి ఎన్.శ్రీవిద్య సోమవారం పరిశీలించారు. భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి అవకాశం ఉందా? లేదా? అంశంపై అధికారులతో చర్చించారు. సాధ్యమైనంత వరకు పాత కోర్టు భవనాన్ని వినియోగంలోకి తీసుకు వస్తే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా ఉంటుందనే ఉద్దేశంతో అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్, కమిటీ సభ్యులు జీవీఎంసీ వారి సహకారంతో భవనాన్ని శుభ్రం చేయించారు. అధికారులతో మాట్లాడి మరోసారి జిల్లా జడ్జి పరిశీలిస్తారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్ తెలిపారు. జిల్లా జడ్జి వెంట అసోసియేషన్ ప్రతినిధులు దుర్గారావు, రోజా, కె. కుసుమ, గేదెల రామచంద్రరావు, సాయిరామ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

**'మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ రద్దు చేయాలి'**

**తుమ్మపాల, జూన్ 10 :** మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని జీవీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు కాసారపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన అనకాపల్లిజోన్ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన క్లాప్ మిత్ర ఏజెన్సీపై విచారణ చేపట్టాలన్నారు. జీవీఎంసీ ఉద్యోగులకు 010 పద్దు వేతనాలను ఉపసంహరించుకోవాలన్నారు. టీఎఫ్ఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అనకాపల్లి జోన్‌లో పెండింగ్‌లో ఉన్న డీఏలు, స్పెషల్ ఇంక్రిమెంట్లు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి. వెంకటేశ్వర్లు, బంగారు రవికుమార్, చిన్ని, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న ఎండలు**

**పరవాడ, జూన్ 10:** మృగశిర కార్తె వచ్చినప్పటికీ ఎండల ప్రభావం ఏ మాత్రం తగ్గలేదు. ఎండతో పాటు ఉక్కపోత జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. మృగశిర కార్తె రాకతో వాతావరణం చల్లబడుతుందని అందరూ భావించారు. కానీ వారం రోజులుగా ఉష్ణోగ్రతలు ఏ మాత్రం తగ్గలేదు. మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో సోమవారం ఎండ తీవ్రతతో పాటు వేడిగాలులు వీయడంతో జనాలు అల్లాడిపోయారు. నిత్యం రద్దీగా ఉండే పరవాడ సంతబయలు జనాలు లేక వెలవెలబోయింది. వ్యాపార సముదాయాలు సైతం బోసిపోయాయి. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ ప్రాంతాల్లో కార్మికులు అవస్థలు పడాల్సి వచ్చింది.

**ఉచిత కంటి వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు**

**పరవాడ, జూన్ 10 :** జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా అనిత ఐ క్లినిక్ సౌజన్యంతో సోమవారం స్థానిక సినిమా హాల్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 250 మందికి పరీక్షలు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పంచకర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు గోపీ, జాక్సన్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 50 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, బుగిడి రామగోవిందరావు, బొద్దపు శ్రీనివాసకాసులు, పైలా రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**వివేకానంద కాలనీలో క్షీణించిన పారిశుధ్యం**

**» డ్రైనేజీని పరిశీలించిన సీపీఎం నేత అప్పలరాజు**



మురుగు నీటిని పరిశీలిస్తున్న అప్పలరాజు

**ఎస్.రాయవరం, జూన్ 10:** మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఉన్న వివేకానంద కాలనీలో పారిశుధ్యం క్షీణించింది. కాలనీలో మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మురుగు నీరు వలన స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు సోమవారం వివేకానంద కాలనీని సందర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కాలనీలో మురుగు కాలువలు జామ్ అయిపోవడంతో నీరు బయటకు వెళ్లడం లేదన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది స్థానికులకు నిద్ర పట్టకుండా చేస్తున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేయించి, మురుగు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

**ఘనంగా దుర్గామాంబ తొలేళ్ల ఉత్సవం**

**» అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పంచకర్ల**

**సబ్బవరం, జూన్ 10 :** సబ్బవరం ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కూటమి నేతలు కొటాన అప్పారావు, ఇందలి రమణ, గొర్లి కుమార్, పల్లా తాతారావు, బంతికోళ్ల పద్మ, కొరాడ శ్రీను గెడ్డం రమేశ్, కన్నారావు సత్కరించారు.

**'పాస్టర్లు సేవా గుణాన్ని ప్రదర్శించాలి'**



పాస్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి డేవిడ్

**అచ్యుతాపురం రూరల్, జూన్ 10 :** యేసు క్రీస్తు పాటించిన సేవా గుణాన్ని పాస్టర్లు ప్రదర్శించి స్థానిక డేవిడ్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాసిల డేవిడ్ అన్నారు. స్థానిక ఫిలదెల్ఫియా చర్చిలో సోమవారం అనకాపల్లి జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను అమెరికాలో ఉంటూ తన ప్రాంత ప్రజలు బాగుండాలనే సదుద్దేశంతో సేవా కార్యక్రమాలను ప్రారంభించానన్నారు. కార్యక్రమంలో యూపీఎఫ్ అధ్యక్షుడు చికిలే ప్రకాష్, పాస్టర్లు యేసురత్నం, రాజు, సన్నీ జేమ్స్, ఎంకేఎస్ ప్రకాష్, తిమోతీనాయుడు, రాజేష్, ఆర్‌కే.మహేష్, అలుగు సుజాత పాల్గొన్నారు.

**'సమస్యలు పరిష్కారానికి కృషిచేయాలి'**

**పాయకరావుపేట, జూన్ 10 :** మండల గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితర సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా తాగునీటి వనరులు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. వీధిలైట్లు మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు జె.చంద్రశేఖర్, వై.సత్యనారాయణ, బీబీఎల్.మూర్తి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మృగశిర కార్తె వచ్చినా ఎండలే..

» భానుడి ఉగ్రరూపంతో జనం బెంబేలు

» ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం ఐదు వరకు వేడి వాతావరణం



మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న చీడికాడ రోడ్డు

**మాడుగుల రూరల్/చీడికాడ, జూన్ 10 :** మృగశిర కార్తె ఆరంభమైనప్పటికీ ఎండలు తగ్గుముఖం పట్టడం లేదు. గత నాలుగైదు రోజులపాటు వాతావరణంలో మార్పుల కారణంగా కాస్త చల్లడినప్పటికీ, ఆది, సోమవారాల్లో మళ్లీ భానుడు ఉగ్రరూపం చూపుతున్నాడు. ఉదయం ఎనిమిది నుంచి సాయంత్ర ఐదు గంటల వరకు ఉష్ణతాపం తగ్గడం లేదు. దీంతో ఒకవైపు ఉక్కపోత, మరోవైపు వడగాల్పులతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్నం పన్నెండు నుంచి మూడు గంటల వరకు చాలా చోట్ల రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

# మాడుగుల సంతలో పైనాపిల్‌కు భలే గిరాకీ

» ఒక్కోపండు రూ. 15 నుంచి 30 వరకు విక్రయం

» మంచి ధర పలకడంతో గిరిజన రైతులు ఆనందం



సంతకు విక్రయానికి తెచ్చి పైనాపిల్

**మాడుగుల, జూన్ 10 :** మండల కేంద్రం మాడుగులలో సోమవారం జరిగిన వారపు సంతలో పైనాపిల్ ఫలాలకు మంచి ధర లభించింది. కందులపాలెం, ఈదులపాలెం, దేవాపురం, సలుగు, పులుసుమామిడి, కక్కి, వంట్లమామిడి, చింతగరువు వంటి గిరిజన ప్రాంతాల్లో పండించిన ఈ ఫలశయాలను రైతులు ఇక్కడికి వాహనాల ద్వారా, కావిళ్ల ద్వారా మోసుకుంటూ వచ్చారు. ఇప్పుడిప్పుడే సీజన్ ఆరంభం కావడంతో వీటికి మంచి గిరాకీ ఏర్పడింది. పండు సైజుని బట్టి సంత ప్రారంభంలో ఒక్కో పండును రూ.15 నుంచి రూ.22 వరకు విక్రయించారు. సంత ఆరంభం నుంచి ఇదే ధర పలకగా చివరిలో కొలుగోలుదారులు పోటీపడడంతో ఒక్కోపండును సైజును బట్టి రూ.30 వరకు విక్రయించారు. దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే, పనస పండ్లను సైతం సంతకు భారీగానే తెచ్చారు. వీటి కొనుగోలు కూడా మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పోటీపడ్డారు. దీంతో ఒక్కోపండు సైజును బట్టి రెండు వందల రూపాయల వరకు ధర పలకడం విశేషం.

## నిర్బంధానికి చెక్

... 3వ పేజీ తరువాయి

ఐకేపీ కార్యాలయానికి వెళ్లారు. ఏపీఎం చినబాబుతో ఈ విషయమై చర్చించారు. మహిళా మార్ట్‌లో డ్వాక్రా మహిళలు విధిగా సరకులు కొనాలనే నిబంధన ఏమైనా ఉందా...అని ప్రశ్నించారు. దీనికి ఏపీఎం అటువంటి నిబంధన లేమీ లేదని స్పష్టం చేశారు. ఇకపై మహిళా మార్ట్‌లో డ్వాక్రా మహిళలకు సరకులు కొనాలనే షరతు విధిస్తే సహించేది లేదని చెప్పారు.

కాగా, మండలంలోని వివిధ గ్రామాల నుంచి 30 డ్వాకా సంఘాల మహిళలు సోమవారం ఆసరా నిధులు బ్యాంకు నుంచి డ్రా చేసేందుకు ముందు మాకవరపాలెంలోని వెలుగు కార్యాలయానికి వచ్చారు. వీరంతా మహిళా మార్ట్‌లో సరకులు కొనుగోలు చేయలేదు. దీంతో ఆసరా నిధుల డ్రా తీర్మానం కాపీపై ఐకేపీ ఏపీఎం సంతకాలు చేస్తారో...లేదోనని వారంతా సందేహించారు. టీడీపీ నాయకులు అక్కడే ఉండడంతో ఏపీఎం సంతకాలు చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

## పెద్దేరుపై చిన్నచూపు

... 3వ పేజీ తరువాయి

రిజర్వాయర్ అధికారులు మండలంలో సాగుకు నీరందించే పరిస్థితి లేక చేతులెత్తేశారు.

**కాలువల ఆధునికీకరణే మార్గం**

రిజర్వాయర్ కాలువను ఆధునికీకరిస్తే తప్ప ఆయకట్టుకు నీరందే అవకాశం లేదని ఇంజనీరింగ్ అధికారులు స్పష్టం చేశారు. దీంతో 13 సంవత్సరాలుగా పెద్దేరు రిజర్వాయర్ నీరు అందడం లేదు. దీనిపై చర్యలు తీసుకోవాలని రైతులు చేసిన విజ్ఞప్తులు పట్టించుకునే నాథుడే లేకపోవడంతో రైతులకు వరుణ దేవుడే దిక్కయ్యాడు. తరచూ వర్షాభావంతో పంటలు దెబ్బతిని ఆర్థికంగా కుదేలవుతున్నాడు. పంట నష్టాలు తప్పకపోవడంతో రైతులు నష్టాల ఊబిలో కురుకుపోతున్నారు.

**బూడి...మాటల హడావుడి**

పెద్దేరు రిజర్వాయర్ అభివృద్ధికి రూ.84.4 కోట్లు మంజూరైనట్టు గత మార్చిలో అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, విప్ కరణం ధర్మశ్రీలు చేసిన ప్రకటన మండల రైతుల్లో ఆశలు చిగురింపజేసింది. ఈ నిధులతో రిజర్వాయర్ అభివృద్ధితో పాటు రూ.40 కోట్లతో ఆర్ఎంసీ, ఎల్ఎంసీ చానల్స్ సీసీ కాంక్రీట్‌తో లైనింగ్ పనులు చేపడతామని ప్రకటించారు. దీంతో ఆనందించిన రైతులు వేలాది ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టారు. వర్షాభావ పరిస్థితి తప్పకపోవడంతో పది గ్రామాల్లో వేలాది ఎకరాలు ఖరీఫ్ సాగు దెబ్బతింది.

**పుష్కర కాలంగా ఎదురుచూస్తున్నాం**

వర్షాభావంతో ఏటా మండలంలో పంటలు దెబ్బతింటున్నాయి. పెద్దేరు రిజర్వాయర్ నిర్మాణంతో సాగునీటి కష్టాలకు తెరపడిందని భావించాం. అయితే ఇంజనీరింగ్ అధికారుల అవగాహన లోపంతో ఆశలన్నీ అడియాశలయ్యాయి. 2011 నుంచి రిజర్వాయర్ నీరు చేరడం లేదు. కుడి కాలువను సీసీ లైనింగ్‌తో ఆధునికీకరించి సమస్యను పరిష్కరించాలి.

**- తుమ్మలపూడి నాగరాజు, ఆయకట్టు రైతు, గున్నెంపూడి.**

## ఉక్కు కష్టాలు తీరేనా?

... 3వ పేజీ తరువాయి

అవసరమైన నిధులు, ముడిపదార్థాలు లేవు. రాష్ట్రం ఏర్పాటయ్యాక కేంద్రంలో ఉక్కు శాఖా మంత్రి పదవి తొలిసారి లభించింది. దక్షిణ భారతదేశంలో తీర ప్రాంతానున్న ఏకైన ప్రభుత్వ కర్మాగారం ఇదే. ఇక్కడ ఏడాదికి 80 లక్షల టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయవచ్చు. దీని ద్వారా రూ.50 వేల కోట్ల ఆదాయం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జీఎస్‌టీ ద్వారా 18 శాతం అంటే రూ.9 వేల కోట్లు ఆదాయం వస్తుంది. ఇవన్నీ జరగాలంటే స్టీల్ ప్లాంటు నిర్వహణకు అవసరమైన నిర్వహణ మూలధనం సమకూర్చాలి. బ్యాంకుల నుంచి రుణం దొరకడానికి రాష్ట్రపతి పేరిట ఉన్న ఉక్కు భూములను ఆర్ఐఎన్ఎల్ పేరిట మార్చించాలి. అప్పుడే సంస్థకు ఆర్థిక పరపతి పెరిగి మార్కెట్‌లో రుణాలు లభిస్తాయి. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. దీనివల్ల మంచి జరుగుతుంది. మంత్రి మనవారే కావడం వల్ల ఇవన్నీ సులువు అవుతాయని విశాఖ ఉక్కు అధికార, కార్మిక సంఘాలు భావిస్తున్నాయి.

**కార్గో విమాన సర్వీసులకు అవకాశం**

కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు పౌర విమానయాన శాఖ రావడం పట్ల ఏపీ విమాన ప్రయాణికుల సంఘం హర్షం వ్యక్తంచేసింది. విశాఖపట్నానికి ఎప్పటి నుంచో కార్గో విమాన సర్వీసులు లేవు. ఇక్కడి నుంచి విదేశాలకు సముద్ర ఉత్పత్తులు, మందులు, దుస్తులు, ఇతర ఆహార ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. అయితే ప్రత్యేకంగా కార్గో విమానాలు లేకపోవడం వల్ల సముద్ర మార్గాల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. దీనికి ఎక్కువ సమయం పడుతోంది. వ్యయం అవుతోంది. మంత్రి ఈ ప్రాంతానికి చెందినవారే కావడం వల్ల కార్గో విమాన సర్వీసులు వీలైనంత త్వరగా తెచ్చుకునే వీలుంది. అంతేకాకుండా రద్దయిన దుబాయ్, శ్రీలంకతో పాటు ఇతర విదేశాలకు కొత్త సర్వీసులు తెచ్చుకోవచ్చు. అదేవిధంగా భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం మరింత త్వరగా అందుబాటులోకి తెచ్చుకునే వీలుంది. ఈ ఇద్దరు మంత్రుల వల్ల విశాఖకు మేలు జరుగుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశిస్తున్నారు.

# కృష్ణాదేవిపేటలో మూతబడిన హోమియో వైద్యశాల

» సిబ్బంది కొరతే కారణం » రోగులకు అందని వైద్యం » శిథిలావస్థకు చేరిన భవనం » పాడైన మందులు



కృష్ణాదేవిపేటలో మూతబడిన ఉన్న హోమియో వైద్యశాల భవనం



వైద్య శాలలో వృథాగా ఉన్న మందులు



**కృష్ణాదేవిపేట, జూన్ 10 :** గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో గల ప్రభుత్వ హోమియో వైద్యశాల మూతబడింది. దీంతో ఈ వైద్యానికి రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. 23 సంవత్సరాల క్రితం స్థానిక మెయిన్ రోడ్డులో గల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేశారు. అవసరమైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండడంతో గొలుగొండ, కొయ్యూరు మండలాలకు చెందిన మైదాన, గిరిజన ప్రాంతాల ప్రజలు రోజుకు వంద మందికి పైగా వచ్చి వైద్యసేవలు పొందేవారు.

ఇదిలావుంటే, సుమారు ఆరేళ్ల క్రితం ఇక్కడ పనిచేస్తున్న వైద్యాధికారిణి లక్ష్మీశైలజా, ఫార్మసిస్టు ప్రసాద్ బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత ప్రభుత్వం వీరిస్థానంలో వేరొకరిని నియమించకపోవడంతో ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు అందేవికావు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి సీహెచ్.అయ్యన్నపాత్రుడుకి హోమియో వైద్యశాల పరిస్థితిని వివరించగా ఉన్నతాధికారులతో మాట్లాడారు. వారానికి ఒక రోజు డిప్యూటేషన్‌పై మరో ప్రాంతం నుంచి ఇక్కడకు వైద్యాధికారి లేద ఫార్మసిస్టు వచ్చి వైద్య సేవలు అందించేవారు. ఇలా ఏడాదిన్నర పాటు రోగులు ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందేవారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఈ ఆస్పత్రిని పట్టించుకోవడం మానేశారు. దీంతో వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. ఫలితంగా విలువైన మందులు పాడయ్యాయి. ఆస్పత్రి భవనం సైతం శిథిలావస్థలకు చేరుకుంది. వర్షాలకు భవనం కారిపోతుండడంతో అందులోని రికార్డులు, మందులు తడిసిపోతున్నాయి. తలుపులు, కిటికీలు, ద్వారబంధాలు పుచ్చిపోయాయి. అయినప్పటికీ కన్నెత్తి చూసేవారు లేకపోవడంతో ఆస్పత్రి పూర్తిగా మూతపడింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హోమియో వైద్య సేవలకు దూరమయ్యారు. ఈ సమస్యను పలువురు స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా స్పందించే వారు లేకపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ఆస్పత్రిపై దృష్టిసారించి, రెండు మండలాల్లోని ప్రజలకు హోమియో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## క్రీడా హబ్‌గా చోడవరం : ఎమ్మెల్యే రాజు



ఎమ్మెల్యే రాజును అభినందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

**చోడవరం, జూన్ 10 :** క్రీడా హబ్‌గా చోడవరాన్ని అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. సోమవారం ఉదయం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజుకు ఇక్కడ సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో క్రీడా సౌకర్యాల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. క్రీడాకారులతో పాటు, వాకర్స్‌కు కూడా అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, డాక్టర్ శకుంతలరావు, రమేష్, వేపాడ సత్యనారాయణ, రమణి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ నిల్వలపై విచారణ



ఇసుక నిల్వను పరిశీలిస్తున్న అధికారులు

**గొలుగొండ, జూన్ 10 :** చీడిగుమ్మల పంచాయతీ పరిధిలోని రెండు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సిబ్బంది స్వాధీనం చేసుకున్న ఇసుక నిల్వలను సోమవారం అధికారులు విచారణ జరిపారు. ఈ సందర్భంగా మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ కె.రవికుమార్ మాట్లాడుతూ పోలవరం గ్రామంలో జగనన్న లేఅవుట్ వద్ద నిల్వ చేసిన సుమారు మూడు ట్రాక్టర్ల ఇసుకకు సంబంధించి ఎటు వంటి అనుమతులు లేవన్నారు. ఇందుకు సంబంధించి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని వివరించారు. అలాగే, చీడిగుమ్మల మద్యం షాపు వద్ద గల ఇసుకను ఇంటి నిర్మాణం నిమిత్తం నిల్వ చేసినట్టు గుర్తించామన్నారు. ఈ విచారణలో ఎస్ఐ షేక్ రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



వడ్డాదిలో కేక్‌కట్ చేస్తున్న తాతయ్యబాబు తదితరులు



రావికమతం మండలం చిలకవానిపాలెంలో..



బాలకృష్ణ పేరిట దుర్గమ్మ ఆలయంలో పూజలు

**బుచ్చెయ్యపేట, జూన్ 10 :** ప్రముఖ సినీ హీరో, ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలను సోమవారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వడ్డాది టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరిపారు. తొలుత ఆయన కేక్‌కట్‌చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీరంగంలో అన్‌స్టాపబుల్ అనిపించుకున్న ఆగ్రహీరో బాలయ్య అని, రాజకీయాల్లోనూ తిరుగులేని ప్రజాదరణ సంపాదించుకున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దొండా నరేష్, రమేష్, దొండా గిరిబాబు, రమేష్, తలారి శంకరరావు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**చిలకవానిపాలెంలో...**

**రావికమతం :** టి.అర్జాపురం పంచాయతీ శివారు చిలకవానిపాలెంలో బాలకృష్ణ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మచ్చా శ్రీను ఆధ్వర్యంలో బాలయ్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతని పేరిట దుర్గమ్మ ఆలయంలో పూజలు జరిపారు. గర్భిణులు, బాలింతలకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచ్ మడగల ఫాల్గుణ, బాలకృష్ణ యూత్ ఉపాధ్యక్షుడు సీతిన రాము, కార్యదర్శి సతీష్, అర్జున, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## 'ప్రైవేటు పాఠశాలల్లో వసతులు మెరుగుపర్చాలి'

**రోలుగుంట, జూన్ 10 :** ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు వసతులను మెరుగుపర్చాలని ఎంఈవో జాన్‌ప్రసాద్ సదరు పాఠశాలల నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం ఇక్కడి ఎమ్మార్సీ భవనంలో త్రిసభ్య కమిటీ, ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యాలపై దృష్టి సారించాలన్నారు. గత వారం రోజులుగా ఆయా పాఠశాలల్లో తనిఖీ చేసిన అంశాల ఆధారంగా వారికి సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయుల నియామకాన్ని చేపట్టాలని ఆదేశించారు. త్రిసభ్య కమిటీ సభ్యులు ఎంఈవో-2 జగ్గారావు, వెంకట్రావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలు, త్రిసభ్య కమిటీతో సమావేశమైన ఎంఈవో జాన్‌ప్రసాద్

## వరి విత్తనాల పంపిణీ ప్రారంభం



వడ్డాది ఆర్‌బీకేలో వరి విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు



దేవరాపల్లిలో విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

**బుచ్చెయ్యపేట, జూన్ 10 :** మండలంలోని వడ్డాది రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాల పంపిణీ సోమవారం ప్రారంభమైంది. కూటమి నాయకులు విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్ మాట్లాడుతూ ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసి రైతులు మోసమోవద్దన్నారు. వ్యవసాయం పరంగా రైతులకు ఎటువంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు దాడి సూర్యనాగేశ్వరరావు, దొండా సన్యాసిరావు, శిరిగిరిశెట్టి చినవెంకయ్యదొర, అడపా నర్సింహమూర్తి, అద్రపు ఈశ్వరరావు, వీర్ల సురేష్, పలూకూరి సురేష్, పొలిమేర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నర్సీపట్నం అర్బన్ :** వరి విత్తనాలు కావలసిన అన్నదాతలు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.అప్పారావు సూచించారు. మండలానికి ఖరీఫ్ సీజన్‌కు 750 టన్నుల వరి విత్తనాలు సిద్ధం చేశామన్నారు. వీటికోసం రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకాల వివరాలతో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

**చీడికాడ :** రైతులకు అవసరమై వరివిత్తనాలు పదమూడు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి ఎం.రమాదేవి తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు ఆధార్ జెరాక్స్, పట్టాదారుపాస్ పుస్తకం, ఫోన్‌నెంబరు వివరాలతో ఆయా రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాల్సిందిగా సూచించారు.

**దేవరాపల్లి :** ప్రతి రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి ఎల్.వై.కాంతమ్మ తెలిపారు. సబ్సిడీపై విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలావుంటే, దేవరాపల్లి రైతు భరోసా కేంద్రంలో సోమవారం విత్తనాల కోసం పలువురు రైతుల పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, సత్యారావు పాల్గొన్నారు.

## విజయవాడకు అయ్యన్న పయనం



విజయవాడ బయల్దేరుతున్న అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, జూన్ 10 :** చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు సోమవారం విజయవాడ బయల్దేరి వెళ్లారు. బుధవారం ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనన్న విషయం తెలిసిందే.ఇదిలావుంటే, తొలుత పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రామాలయ వార్షికోత్సవం



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ రమణమ్మ

**నర్సీపట్నం అర్బన్ , జూన్ 10 :** మండలంలోని ధర్మసాగరంలో రామాలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్దసంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఏర్పాటైన అన్నసమారాధనను జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ ప్రారంభించారు.

## పూరిల్లు దగ్ధం



ప్రమాదంలో దగ్ధమైన ఇల్లు

**కృష్ణాదేవిపేట, జూన్ 10 :** చోద్యం జంక్షన్‌లో సోమవారం పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన బొత్సా రాంబాబు స్వీట్ కొట్టు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాడు. స్వీట్లు తయారు చేస్తుండగా తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో స్వీట్ల తయారీ సామగ్రితో పాటు విక్రయానికి సిద్ధంగా ఉంచిన సీట్లు కాలిపోయాయి. గ్యాస్ సిలెండర్‌కు నిప్పంటుకోవడంతో మంటలు అదుపుచేయడం సాధ్యం కాలేదు. ఈ ఘటనలో సుమారు మూడు లక్షల వరకు నష్టం జరిగినట్టు బాధితుడు వాపోయాడు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నర్సీపట్నం, జూన్ 10 :** ఇక్కడి ఇన్‌డోర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏడీ సత్యానందం తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఫీడర్ పరిధిలో ఉన్న శివపురం, పెద్ద చెరువు, గుర్రాల రోడ్డు, ధనిమిరెడ్డి వీధి, పాలిటెక్నిక్ కళాశాల వరకు ఉన్న ప్రాంతాలలో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటలు వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు.

## 18 నుంచి డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్లు

**నర్సీపట్నం, జూన్ 10 :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18 నుంచి ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. బీఏకు రూ.5,790, బీఎస్సీకి 8,790, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌కు రూ.9790, ఫిజిక్స్, బోటనీ, కెమిస్ట్రీ కోర్సులకు రూ.5,790 చొప్పున ఫీజులుగా నిర్ధారించారు. బీకాం కంప్యూటర్ సైన్స్ 60 సీట్లు, మిలిగిన సబ్జెక్టులకు 40 సీట్లు చొప్పున ఉన్నతాధికారులు ఎలాట్‌మెంట్ ఇచ్చారు. తాజాగా బీఏ హిస్టరీ కోర్సు ప్రవేశపెట్టనున్నారు. కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్టు 40 నుంచి 60కి, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ 20 నుంచి 40 సీట్లుకు పెంచారని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎఎస్ కృష్ణ తెలిపారు.

## ఇసుక డిపోలు మూత

... 3వ పేజీ తరువాయి

జిల్లాలో డిపోలు మూత పడడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు అవసరం పేరుతో రాత్రి, పగలు తేడా లేకుండా నదుల్లో అనధికారంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ టైరు బండ్లపై రవాణా చేస్తోంది. అనకాపల్లి, చోడవరం మండలాల సరిహద్దు ప్రాంతాల్లో శారద, పెద్దేరు, బొడ్డేరు నదుల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. చోడవరం మండలం గజపతినగరం, జుత్తాడ, గవరవరం, దేవరాపల్లి మండలం తిమిరాం, కలిగొట్ల, పెద్దేరు పరిధిలో గౌరీపట్నం, వి.మాడుగుల మండలం వాడపాడు, సాగరం, ఎలమంచిలి, ఎస్.రాయవరం మండలాల పరిధిలో వరహా నదిలో దార్లపూడి గ్రామంలో స్థానిక అవసరాల పేరుతో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. జిల్లాలో ఇసుక డిపోలు మూతపడిన మాట వాస్తవమేనని, కొత్త ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం త్వరలోనే నూతన ఇసుక పాలసీ అమలులోకి వస్తుందని గనుల శాఖ జిల్లా అధికారి సుబ్బారాయుడు తెలిపారు. నదుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవని స్పష్టంచేశారు.

## వెలుగుల మాటున చీకట్లు!

... 3వ పేజీ తరువాయి

పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలన్నీ కలుషితమయ్యాయి. బావుల్లో నీరు పనికిరాకుండా పోతోంది. పశువులకు నీరందించడం కూడా కష్టంగా మారుతోందని రైతులు వాపోతున్నారు. కొన్నిచోట్ల చేతి పంపు నీరు ఉప్పునీటిగా మారిపోయింది. దీంతో గ్రామస్థులు తాగునీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తాగునీటిని సరఫరా చేయాలని సింహాద్రి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పట్టించుకోలేదని దీంతో పరవాడ, చీపురుపల్లి, తదితర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నామని తెలిపారు.

**పట్టించుకోని పాలకులు, అధికారులు....**

కాలుష్యంతో ఏళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని, దీంతో దుర్భర జీవనం గడుపుతున్నామంటున్నారు. కాలుష్యం కారణంగా ప్రబలిన రోగాలతో ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారని, మరింతమంది ప్రాణాలు పోయేలోగా పరిష్కార మార్గాన్ని చూపాలని కోరుతున్నారు. ఎన్టీపీసీ నిర్మాణం కోసం ఉన్న కొద్దిపాటి భూములు కోల్పోయామని, పరిశ్రమ వస్తే తమ జీవితాలు బాగుపడతాయని భావించామని, కానీ ప్రస్తుతం జీవించే పరిస్థితే కనిపించడం లేదంటున్నారు.

**కాళ్లు వంకర పోయాయి**

సింహాద్రి కాలుష్యం కారణంగా కాళ్లు వంకరపోయాయి. నడవ లేకపోతున్నాను. ఈ కష్టం ఎవరికీ రాకూడదు. గ్రామంలో ఉండలేకపోతున్నాం. ఎన్టీపీసీ అధికారులు కూడా మా బాధలు పట్టించుకోవడం లేదు. ఎంతకాలం ఈ నరకం అనుభవించాలి.

**- కాలపురెడ్డి అప్పలనాయుడు**